# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**పత్రికా ప్రకటన**

తేదీ : ఏప్రిల్ 17, 2021.

## అంతర్జాతీయతావాద మేడే వర్ధిల్లాలి!
## ప్రపంచ విప్లవ కార్మికుల, శ్రమజీవుల, వారి సంస్థల
## మరింత సమైక్యతకు, సంఘటితీకరణకు నడుం బిగిద్దాం!

అరుణపతాకను ఎత్తిపట్టి తొలిసారి కార్మికవర్గ రాజ్యాధికారాన్ని ఎలుగెత్తి చాటిన 'పారిస్ కమ్యూన్'కు 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంలో ప్రపంచవ్యాప్తంగా శ్రమజీవులు ప్రధానంగా కార్మికవర్గం ఈ సంవత్సరం మేడే జరుపుకోబోతుంది. ఇది యావత్ కార్మికవర్గానికి పెద్ద పండుగ రోజు. ఇది ప్రపంచ కార్మికవర్గ హక్కుల దినం. కార్మికవర్గం స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వం, సోదరతత్వం కోసం, తన బలాబలాలను బేరీజువేసుకొని నిర్విరామంగా, మరింత దృఢనిశ్చయంతో పోరాడడానికి తన శక్తినంతటినీ సమీకరించుకోవడానికి నడుం బిగిస్తామనీ, తమ తమ దేశాలలో కార్మికవర్గ విప్లవాల, ప్రపంచ సోషలిస్టు విప్లవ విజయానికై ప్రతినబూనే రోజు మేడే. మే డే సందర్భంగా మా పార్టీ కేంద్రకమిటీ ప్రపంచ కార్మికవర్గానికి రెడ్‌శల్యూట్స్ అందచేస్తూ విప్లవాభివందనాలు తెలియజేస్తోంది. తమ హక్కుల సాధన కోసం ప్రాణత్యాగం చేసిన శ్రమజీవులందరికీ వినమ్రంగా తలవంచి విప్లవ జోహార్లు అర్పిస్తోంది.

ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. ఆ సంక్షోభ భారాన్ని కార్మికవర్గంపై నెట్టడానికి శ్రమశక్తి దోపిడీని తీవ్రతరం చేయడానికి దోపిడీ పాలకవర్గాలు అనేక రకాల దాడులకు, కుట్రలకు పాల్పడుతున్నాయి. 2008 నాటి ద్రవ్య, ఆర్థిక సంక్షోభాన్ని మించిన స్థాయిలో ప్రపంచ సంక్షోభం బద్దలు కానున్న తరుణంలో కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని ఆవహించింది. సామ్రాజ్యవాదులు తమ లాభాల వేటలో సృష్టించిన ప్రాణాంతక వైరస్‌లలో ఇది ఒకటి. వర్తమాన ప్రపంచం కోవిడ్ మహమ్మారితో అతలాకుతలం అవుతూ కోట్లాది మంది వలస శ్రామికులు ఉపాధి కోల్పోయి వీధుల పాలవుతుంటే బహుళజాతి కార్పొరేట్ సంస్థలు, వారి దళారీ కంపెనీలు వాక్సిన్ వ్యాపారంలో పోటీ పడుతూ అనేక రెట్లు అధికంగా సూపర్ లాభాలు గడిస్తున్నాయి. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఫలితంగా ఎన్నడూ లేని స్థాయికి చేరుకున్న పెట్టుబడిదారీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ విస్తరణ వల్ల సామ్రాజ్యవాదానికీ పీడిత జాతులకు, ప్రజలకు మధ్య, బూర్జువా వర్గానికి కార్మికవర్గానికి మధ్య, సామ్రాజ్యవాద శక్తుల మధ్యనూ అంతర్గత వైరుధ్యాలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. పీడిత జాతుల మీద, ప్రజల మీదా సామ్రాజ్యవాద దురాక్రమణ, శ్రమపై పెట్టుబడి దాడి ప్రపంచవ్యాప్తంగా పెరిగాయి. ప్రపంచాధిపత్యం కోసం, ప్రపంచ దేశాల ప్రాకృతిక సంపదలను దోపిడీ చేసేందుకు సామ్రాజ్యవాదుల మధ్య, ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదులకు, చైనా సోషల్ సామ్రాజ్యవాదుల మధ్య పోటీతో ప్రపంచ దేశాల మార్కెట్ల పునర్విభజన జరుగుతున్నది. వెనుకబడిన దేశాల పీడిత ప్రజలపై ఈ 'వ్యాపార యుద్ధం' తీవ్రమైన ఆర్థిక భారం మోపుతున్నది. దీంతో కార్మికవర్గం, రైతాంగం, మధ్య తరగతి ప్రజలు, మహిళలు, మతపర అల్పసంఖ్యాక వర్గాలు, పీడిత జాతులు, జాతి వివక్ష ఎదుర్కొంటున్న జాతులు, ఇతర సమూహాలూ మొదలయిన ప్రజలంతా మరింత తీవ్రమైన ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక దోపిడీ పీడనలకు గురవుతున్నారు. ఉన్నవారికి లేనివారికీ మధ్య తారతమ్యం, గతంలో ఎన్నడూ లేని స్థాయికి చేరుకున్నది. ప్రపంచవ్యాప్తంగా నిరుద్యోగం, ఆకలి, పేదరికం, అసమానతలు, జాతి వివక్షలతో శ్రామిక ప్రజలు విలవిలలాడుతున్నారు. ఇవన్నీ సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల వెన్నంటి వచ్చిన దుష్ఫలితాలే.

నయా వలస దోపిడీ విధానాలతో వెనుకబడిన దేశాల కార్మికులే కాక సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ దేశాల కార్మికులు కూడా తీవ్రాతి తీవ్రమైన దోపిడీకి గురి అవుతున్నారు. ప్రపంచ కార్మికవర్గం ఐక్యమయ్యే పరిస్థితి, కావలసిన అవసరం రోజు రోజుకూ పెంపొందుతున్నాయి. ప్రపంచీకరణ విధానాల అంతానికై దృఢంగా పోరాడాల్సిన సమయమిది. సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ దేశాలలోని కార్మికవర్గంతో పాటు అనేక అర్ధవలస, నయా వలస దేశాలలో సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలకు వ్యతిరేకంగా అన్ని సెక్షన్‌ల ప్రజలు పోరాడుతున్నారు. ఈ పోరాటాలకు ఎక్కడికక్కడే సంఘటిత కార్మికవర్గ అగ్రగామిదళాలు/విప్లవ కమ్యూనిస్టు పార్టీలు నాయకత్వాన్ని అందించాల్సి ఉంది. ఈ దిశలో అవి మరింత సమైక్యంగా, సంఘటితంగా ముందుకు సాగాల్సిన అవసరం నేడు పెరుగుతున్నది.

మన దేశంలో కూడా కార్మికవర్గం, రైతాంగంతో సహా సమస్త పీడిత వర్గాలు, సామాజిక సెక్షన్‌లూ, పీడిత జాతులు సామ్రాజ్యవాద దన్నుతో బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజం రూపంలో మోదీ ప్రభుత్వ క్రూర దాడిని ఎదుర్కొంటున్నాయి. దీనికి వ్యతిరేకంగా కార్మికుల, ఉద్యోగుల, రైతాంగ పోరాటాలు రోజు రోజుకూ తీవ్రతరమవుతున్నాయి. మోదీ ప్రభుత్వం సామ్రాజ్యవాద ద్రవ్య పెట్టుబడి ప్రయోజనాలను కాపాడేందుకు కార్మికవర్గంపై రోబొటిక్, థ్రీ డీ ప్రింటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీతో దాడి చేస్తూ, ఈ దాడిని చట్టబద్ధం చేసుకునేందుకు కార్మిక ప్రయోజనాలను కాపాడే 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా కుదించింది. ఈ ద్విముఖ దాడికి వ్యతిరేకంగా

సంఘటిత, అసంఘటిత కార్మికులు మిలిటెంట్ ఆందోళనలు చేస్తున్నారు. భారత రైతాంగం మున్నెన్నడూ లేని విధంగా దేశ రాజధానిని కేంద్రం చేసుకొని ఆరు నెలలుగా రాజీలేని పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. జీ.ఎస్.టీ.ని రద్దు చేయాలనీ వ్యాపారస్థులు పోరాడుతున్నారు. బ్యాంకుల విలీనాన్నీ, వివిధ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ లక్షలాది సంఘటిత, అసంఘటిత కార్మికులు, ఉద్యోగులు సమ్మెలకు దిగుతున్నారు. కేంద్రంలో హిందుత్వ ప్రతీఘాతుక శక్తులు రూపొందించిన జాతీయ విద్యా విధానాన్ని (2020) విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు వ్యతిరేకిస్తున్నారు. విప్లవోద్యమానికి శక్తివంతమైన కేంద్రాలుగా నిలిచిన వ్యూహాత్మక ప్రాంతాల మూలవాసులతో సహ దేశ మూలవాసులంతా తమ న్యాయమైన హక్కుల కోసం సమరశీలంగా పోరాడుతున్నారు. భారతదేశ ప్రత్యేకతలలో ఒకటైన బ్రాహ్మణీయ కులాధారిత వ్యవస్థకూ, అది కొనసాగించే దోపిడీ, పీడన, అణచివేత, వివక్షలకు వ్యతిరేకంగా శ్రామిక కులాలు సమైక్య పోరాటాలు చేపడుతున్నాయి. దేశంలో పోరాట ప్రజలకు అండగా నిల్చిన ప్రజాస్వామిక, ప్రగతిశీల శక్తులపై రాజ్యం విరుచుకుపడుతూ వారిని కటకటాల పాలుచేస్తున్నది. ఫాసిస్టు బ్రాహ్మణీయ హిందుత్వ శక్తుల మతోన్మాద హింసా విధానాలకు వ్యతిరేకంగా లౌకికశక్తులు పోరాడుతున్నవి. పోరాడుతున్న ప్రజలపై నిరంకుశంగా అమలు చేస్తున్న ఫాసిస్టు చట్టాలను ఉపసంహరించు కోవాలనీ అనేక హక్కుల సంఘాలు సమైక్యంగా నినదిస్తున్నవి.

ఈ విధంగా ప్రపంచవ్యాప్తంగా వెనుకబడిన దేశాల ప్రభుత్వాలు అన్నీ బహుళజాతి కార్పొరేటు కంపెనీల ప్రయోజనాలను నెరవేర్చేందుకు ఒకేలా వ్యవహరిస్తున్నవి. కాబట్టి, అన్ని దేశాలలో పోరాడుతున్న సమస్త శ్రమజీవుల పోరాటాలకు విప్లవ కార్మికవర్గ పార్టీలు, సంస్థలు నాయకత్వాన్ని అందించాల్సిన అవశ్యకత గతం కన్న బలంగా ముందుకు వచ్చింది.

అంతర్జాతీయంగా విప్లవ పరిస్థితులు పెంపొందుతున్నాయనేది గత రెండు సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా పెద్దెత్తున సాగుతున్న పీడిత ప్రజల, జాతుల పోరాటాల ద్వారా స్పష్టమవుతోంది. ఈ అనుకూల పరిస్థితులను ప్రపంచ కార్మికవర్గం వినియోగించుకోవడం ద్వారా అది ప్రపంచ సోషలిస్టు విప్లవాన్ని విజయవంతం చేసే తన ప్రధాన కర్తవ్యాన్ని పరిపూర్తి చేసే దిశలో ముందడుగు వేయగలదు. అంతర్జాతీయ కార్మికవర్గ నిజమైన అగ్రగామి దళాల, సంస్థల ముందు నేడు రెండు వ్యూహాత్మక కర్తవ్యాలు ఉన్నాయి. మొదటిది, పెట్టుబడిదారీ-సామ్రాజ్యవాద దేశాలలో కార్మికుల, ఇతర పీడిత సెక్షన్‌ల విప్లవ ఉద్యమాలు ప్రారంభించాలి. ప్రతి అర్ధవలస, అర్ధభూస్వామ్య దేశంలో కార్మికవర్గాన్ని, రైతాంగాన్ని, ఇతర ప్రజాస్వామిక వర్గాలను, సామాజిక సెక్షన్‌లనూ సంఘటితం చేసి, జాతీయ-ప్రజాస్వామిక ఉద్యమాలు, ఇంకా ప్రారంభం కాని చోట వాటిని నిర్మించాలి, నడిపించాలి. రెండోది, సామ్రాజ్యవాదానికి దాని దళారులకూ వ్యతిరేకంగా పెట్టుబడిదారీ దేశాల కమ్యూనిస్టు ఉద్యమాల, నయా వలస, అర్ధ వలస దేశాల జాతీయ-ప్రజాస్వామిక ఉద్యమాల బలమైన ఐక్యసంఘటనను నిర్మించాలి. ఇందుకోసం నిజమైన కార్మికవర్గ పార్టీలు, సంఘాలూ ప్రస్తుత నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా తగిన అంతర్జాతీయ విప్లవ కార్మికవర్గ సంస్థను నెలకొల్పడం అవసరం. అలాగే మావోయిస్టు శక్తులు ప్రతి ఒక్క దేశంలో ఉన్న సమస్త ప్రగతిశీల, ప్రజాస్వామిక శక్తులతో ఐక్యం కావడంతో పాటు ప్రపంచవ్యాప్త శత్రువుకు వ్యతిరేకంగా సమస్త సామ్రాజ్యవాద వ్యతిరేక, ప్రజాస్వామిక శక్తులతో ఐక్యం కావాలి. ఈ రెండు వ్యూహాత్మక కర్తవ్యాలూ పరస్పరం సంబంధం కలిగి ఉండి, ప్రపంచ సోషలిస్టు విప్లవాన్ని పురోగమింపజేయడంలో ముఖ్యమైన పాత్ర వహిస్తాయి.

అయితే ప్రపంచవ్యాప్తంగా కార్మికవర్గ అగ్రగామి దళాలు, సంస్థలు నేటి శ్రామిక ప్రజల డిమాండ్లను అందుకొని వారి విముక్తి దిశలో విప్లవాలకు సమైక్య నాయకత్వాన్ని అందించేంతగా బలపడలేదన్నది ఒక వాస్తవం. ప్రపంచ కార్మికవర్గ అగ్రగామి దళాల మధ్య సమైక్యత, సంఘీభావం పెంపొందించేందుకు అంతర్జాతీయ వేదిక నిర్మాణావశ్యకతను తెలియచేస్తూ మా పార్టీ తన వైఖరిని ప్రకటించింది. దీనిపై స్పందించవలసిందిగా, ఈ దిశలో కృషిని ముందుకు తీసుకుపోవలసిందిగా సోదర సంస్థలకు మా పార్టీ కేంద్రకమిటీ విజ్ఞప్తి చేస్తోంది.

సామ్రాజ్యవాదుల అన్ని రకాల దాడులను తిప్పికొడుదాం. సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజా పోరాటాలకు నాయకత్వాన్ని అందిస్తూ ప్రపంచ సోషలిస్టు విప్లవ విజయానికై పాటుపడుదామని ప్రతిన బూనుదాం. ఈ దిశలో మనం మరింత సమైక్యంగా సంఘటితమవుదాం. ఇది నేటి ఆవశ్యకత.

- మేడే వర్ధిల్లాలి. ఇంక్విలాబ్ జిందాబాద్.
- ప్రపంచ సోషలిస్టు విప్లవం వర్ధిల్లాలి. అన్ని రకాల రివిజనిజం నశించాలి.
- సామ్రాజ్యవాదం నశించాలి. కార్మికవర్గ విప్లవాలు వర్ధిల్లాలి.

Abhay

**అభయ్,**

**అధికార ప్రతినిధి, కేంద్ర కమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు).**